
క్లుప్తంగా

ప్రిన్సిపాల్ లేక విద్యార్థుల అవస్థలు

• టీసీలు ఇచ్చే ప్రక్రియకు బ్రేక్



మడకశిర: పట్టణంలోని ఒకేషనల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లేక విద్యార్థులకు టీసీలు ఇచ్చే ప్రక్రియ ఆగిపోయింది. దీంతో విద్యార్థులు టీసీలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.... ఇటీవలనే ఈ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ పదవీ విరమణ చేశారు. అయితే ఆయన స్థానంలో ప్రభుత్వం కొత్తగా ప్రిన్సిపాల్‌ను నియమించలేదు. అంతేకాకుండా సంబంధిత ఉన్నతాధికారులు కూడా ఈ కళాశాలలో పని చేసే ఇతర అధ్యాపకులకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించలేదు. దీంతో టీసీలు ఇచ్చే ప్రక్రియ ఆగిపోయింది. కళాశాలలో చదివి పాసైన విద్యార్థులు డిగ్రీ తదితర కోర్సుల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు టీసీలు (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) ఎంతో అవసరం. టీసీల కోసం విద్యార్థులు కొన్ని రోజుల నుంచి కళాశాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. వెంటనే కడప ఆర్‌జేడీ, జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి చర్యలు తీసుకుని విద్యార్థులు టీసీలకు ఇబ్బందులు పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆవు అపహరణపై కేసు నమోదు

పరిగి: మండలంలోని బీచిగానిపల్లిలో పాడి ఆవు అపహరణపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ హిదయతుల్లా తెలిపారు. పది రోజుల క్రితం బీచిగానిపల్లిలో పాడి రైతు అంజినప్పకు చెందిన పాడి ఆవును ఇంటి పక్కన కట్టేసి ఉంచారు. మరుసటి రోజు ఆవు కొట్టంలో లేదు. దీంతో రైతు అంజినప్ప పలు గ్రామాలలో ఆవు కోసం గాలింపు చేపట్టాడు. అయినప్పటికీ ఆవు ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్



మంటల్లో కాలిపోయిన టిప్పర్

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారి పల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి పనులు చేపడుతుండగా రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ ఢీకొంది. అయితే టిప్పర్‌పై విద్యుత్ తీగలు పడటంతో మంటలు చెలరేగాయి. మంటల్లో రోడ్డు పనులు చేపట్టడానికి వినియోగిస్తున్న టిప్పర్ పూర్తిగా కాలిపోయింది. టిప్పర్ డ్రైవర్ సురక్షితంగా తప్పించుకొన్నారు.

రేపు వారపు సంత వేలం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని వారపు సంతతో పాటు బస్టాండులో వ్యాపార వ్యవహారాలు నిర్వహించుకోవడానికి గురువారం ఉదయం 11 గంటలకు లేపాక్షి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులు వారపు సంతకు రూ.30 వేలు, బస్టాండుకు రూ. 2 లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వేలం పాటదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


వేగంగా పంట రుణాల రెన్యూవల్



రైతులతో కిటకిటలాడుతున్న గ్రామీణ బ్యాంకు

లేపాక్షి: లేపాక్షిలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పంట రుణాలు పొందిన రైతులు పంట రుణాల రెన్యూవల్స్‌ను వేగంగా చేసుకుంటున్నారని మేనేజర్ జబీవుల్లా తెలిపారు. బ్యాంకులో సుమారు 2,900 మంది రైతులు పంట రుణాలు పొందగా ఇప్పటి వరకు 1,400 మంది రైతులు రెన్యూవల్ చేసుకున్నట్లు వెల్లడించారు. మిగిలిన రైతులు కూడా త్వరితగతిన రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో బిల్‌కలెక్టర్ మృతి



రామయ్య(ఫైల్)

హిందూపురం: హిందూపురం మున్సిపాలిటీలోని బిల్‌కలెక్టర్ రామయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే పట్టణ సచివాలయంలో కొంతకాలం ఆయన కార్యదర్శిగా పనిచేశారు. అయితే అనారోగ్యం బారిన పడిన రామయ్య అనంతపురంలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, హిందూపురంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సంతాపం తెలిపారు.

పాములతో జాగ్రత్త



• వర్షాకాలంలో సర్పాల సంచారం అధికం
• జాగ్రత్తలు పాటిస్తే పాము కాటుకు దూరం
• రెండేళ్లలో 239 మందికి పాముకాట్లు .. 16 మంది మృతి

హిందూపురం అర్బన్: వర్షాకాలం ప్రారంభమైంది. అన్నిచోట్లా వానలు కురుస్తుండడంతో రైతులు పొలం పనుల్లో బీజీ అయ్యారు. ఇది పాములకు అనువైన కాలం. జూన్, జూలై నెలల్లో పాములు తమ ఆవాసాలను విడిచి బయటకు వస్తుంటాయి. ఈ క్రమంలో పొలం పనులకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

జిల్లాలోని 32 మండలాల్లో...

జిల్లాలోని 32 మండలాల్లో ఎక్కువగా కొండలు, గుట్టలు అటవీ ప్రాంతంతో పాటు పచ్చికతో ఉన్నవే ఎక్కువ. ఈ సీజన్‌లో పచ్చిక ఎక్కువగా పెరుగుతుండటంతో విషసర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు గతంలో పాముకాట్లకు గురైన సంఘటనలు అనేకం. ఈ సీజన్‌లో పొలాల్లోకి వెళ్లే వారు చాలా అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రాణాపాయ పరిస్థితులు తప్పవు. జిల్లాలో రెండేళ్ల రికార్డులను పరిశీలిస్తే పాముకాటుకు గురైన వారు 236 మంది ఉన్నాయి. **అందులో 16 మంది మృత్యువాత పడ్డారు.**

పాములన్నీ ప్రమాదకరం కాదు

పాముల్లో ఎక్కువ అధికశాతం ప్రమాదకరమైనవి కాదు. ప్రధానంగా కట్లపాములు కాటేసిన క్షణాల్లోనే దాని విషం రక్తంలో కలుస్తుంది. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. నాగుపాము కాటేస్తే 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది. ఇక రక్తపింజరి కాటేసిన రెండు గంటల తరువాత విషం శరీరమంతా చేరుతుంది. అలాగే జెర్రిపోతు, నీరు కట్టు వంటి వాటిలో విష ప్రభావం తక్కువ. అయితే అశ్రద్ధ చేయ**కుండా ఆస్పత్రిలో చూపించుకోవాలి.**

పాములు కాటేస్తే..

పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు గుర్తులు పడుతాయి. అర గంటలో శరీరమంతా రక్తంలో కలిసి నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ప్రధానంగా పాము కుట్టిన వెంటనే ఆ ప్రాంతంలో నొప్పి రావడం, కొంత సేపటికే కళ్లు మూతలు పడటం, మాట ఆగిపోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. వ్యక్తిని విషపూరితమైన పాము కాటేస్తే శరీరమంతా నీలం రంగుగా మారడం, రక్తపోటు తక్కువగా ఉండి స్పృహ కోల్పోతారు. కాటు వేసిన చోట కొందరు ఆ ప్రాంతంలో గాట్లు పెట్టడం, బ్లేడుతో కోయడం చేస్తుంటారు. అలా చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. పాము కాటు వేసిన చోట రక్త ప్రసరణ జరగకుండా గట్టిగా కట్టు కట్టి వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. జిల్లాలోని 50 శాతం పాములు ప్రమాదకరం కానివే. వాటి కాటుకు సాధారణ చికిత్స తీసుకుంటే సరిపోతుంది. అయితే పాము కాటుకు గురైన సమయంలో ఇంట్లో వారు బాధితుడికి ధైర్యం చెప్పాలి. వారి వద్ద అధైర్యపడితే మాత్రం భయాందోళనకు గురవుతారు. ఇది గుండెపోటుకు దారి తీసే అవకాశం ఉంది. పాము కాటుకు గురైన వారిని 99 శాతం బతికించే అవకాశం ఉంటుందంటున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి ...

సాధ్యమైనంత వరకు పాములు, విష కీటకాల బారిన పడకుండా ఉండాలి. రాత్రిపూట పొలాల వద్ద వెళ్లే వారు కర్ర, టార్చ్‌లైటు తీసుకెళ్లాలి. పొలాల గట్లపై గడ్డి పెరగకుండా చూసుకోవాలి. నడిచేదారి సక్రమంగా కనిపించేలా చర్యలు చేపట్టాలి. కప్పలు, ఎలుకలు ఉన్న చోట పాములు సంచరిస్తుంటాయి. ఇంటి ఆవరణలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు, రంధ్రాలు, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. ఇళ్లలో ఎలుకలు ఉంటే పాములు వస్తాయి. చిన్నారులు రాళ్ల, చెట్ల పొదల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. రాత్రిపూట పొలాలకు వెళ్లే వారు సాధ్యమైనంత వరకు పొడవాటి బూట్లు ధరించడం ఎంతో మంచిది. ఏదో ఒక సర్పం కాటు వేసిందనగానే ఎక్కువ శాతం భయాందోళనకు గురై మరణించే వారు అధికంగా ఉంటారు. పాము కాటు వేసిన వారికి ధైర్యం చెప్పి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

అందుబాటులో యాంటీ వీనమ్ ఇంజక్షన్లు



ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, డిస్ట్రిక్ట్ ఆస్పత్రిలో 20–30 వరకు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచారు. పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన, భయం వీడి తక్షణం సమీప పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో చూపించుకోవాలి. గాయాన్ని బట్టి, కరచిన పాము విష ప్రభావాన్ని బట్టి స్నేక్ వీనమ్ డోసులు తీసుకొంటే సరిపోతుంది.

– శివకుమార్, వైద్యులు, హిందూపురం ప్రభుత్వాస్పత్రి

ఘనంగా బాట్లమ్మ విగ్రహ ప్రతిష్ట



తాడిమర్రి: దాడితోటలో బాట్లమ్మ విగ్రహ ప్రతిష్టను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూజారి శ్రీనివాసులు శర్మ అమ్మవారి మూలవిరాట్‌కు బంగారు, వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పూల మాలలతో అందంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు (గుడికట్టుదారులు) పాల్గొని అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నాగిరెడ్డిగారి, కోనంకిగారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న రవాణాశాఖ అధికారి వరప్రసాద్

కదిరి టౌన్: విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రవాణా శాఖ అధికారి వరప్రసాద్, సీఐ పుల్లయ్య సూచించారు. రాష్ట్రీయ చలాక్ ఏక్తా మహా మంచ్ దేశీయ డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని షాదీమహల్‌లో మంగళవారం మహా సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రవాణా శాఖ అధికారి వరప్రసాద్, సీఐ పుల్లయ్య హాజరై డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అంతకు మునుపు డ్రైవర్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాద రహిత డ్రైవర్లకు ఉత్తమ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

రైల్వేలైన్ పనులు పూర్తి చేయండి

మడకశిర: రాయదుర్గం–తుమకూరు రైల్వేలైన్ పనులు వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత, ఏడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతిపత్రం కూడా పంపినట్లు పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న తుమకూరు లోకసభ ఎంపీ అయిన సోమన్నకు కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి పదవి లభించడం హర్షణీయమన్నారు. అయితే కేంద్ర మంత్రి మడకశిర మీదుగా చేపట్టిన రాయదుర్గం – తుమకూరు రైల్వే లైన్ పనులను సత్వరమే పూర్తి చేసి సరిహద్దు ప్రజలకు కానుకగా ఇవ్వాలని కోరారు. రాయదుర్గం నుంచి పావగడ వరకూ రైల్వేలైన్ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. అదే విధంగా పావగడ నుంచి మడకశిర మీదుగా చంద్రబావి వరకూ రైల్వే పనులు జరుగుతున్నాయని తెలిపారు. అయితే మధుగిరి తాలూకా చంద్రబావి నుంచి తుమకూరు వరకూ రైల్వేలైన్ పనులు చాలా కాలం నుంచి ఆగిపోయాయని మంత్రికి పంపిన వినతిపత్రంలో వివరించారు. మిగిలిన పనులను పూర్తి చేస్తే మడకశిర నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే అన్ని విధాలుగా వెనుకబడిన సరిహద్దు ప్రాంతాలు కూడా అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మడకశిర మీదుగా చేపట్టిన తుమకూరు రైల్వేలైన్ పనులను జాప్యం చేయకుండా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

లేపాక్షి: ఉపాధి పథకం కింద పనిచేస్తున్న ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వ్యవసాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కంచిసముద్రం, మామిడిమాకులపల్లి గ్రామాల్లో కూలీలు పనిచేస్తున్న పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పనిచేసేచోట మస్టర్లను రాసి అక్కడే వారికి బిల్లులు గురించి అవగాహన కల్పించాలన్నారు. కొంతమంది అధికారులు పే స్లిప్‌లు ఇవ్వకుండా మస్టర్‌లను రాయకుండా కాలయాపన చేసి పనిచేస్తున్న కార్మికుల శ్రమను దోపిడీ చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు ప్రేమావతి, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, ఆనందప్ప, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

హిందూపురం టౌన్: నీట్ పరీక్ష – 2024 ఫలితాలు, నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీట్ పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో సమావేశం విలేకరులతో మాట్లాడారు. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పారదర్శకత, పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాల్లో ఒకే పరీక్ష కేంద్రంలో ఒకే సీరియల్ నంబర్లతో కూడిన ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కనుక దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, ప్రదీప్, బాబా ఫకృద్దీన్, సుభాష్, హేమంత్, శశికుమార్, వినయ్, నాగరాజు, రోహిత్ పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో తరలివచ్చిన భక్తులు

• వేలాదిగా తరలివచ్చిన భక్తులు

హిందూపురం: పట్టణంలోని కోటిపిరోడ్డు మోడల్ కాలనీలో వెలసిన గంగమ్మ తల్లి జ్యోతుల ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. బెస్తసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి మూడేళ్లకొకసారి ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే నిర్వహించిన ఉత్సవానికి హిందూపురం పరిసరా ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. లక్ష్మీపురంలోని భజన మందిరం నుంచి మేళాతాళాలతో అమ్మవారికి జ్యోతులను ఎత్తుకుని మోడల్‌కాలనీ వరకూ తరలివచ్చి జ్యోతులను గంగమ్మ గుడిలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు ఆలయంలో అల్పాహారం అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, సెరికల్చర్ జేడీ లక్ష్మీనారాయణ, బెస్త సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి శివయ్య, కోశాధికారి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో గంగమ్మ తల్లి

విద్యావంతులుగా ఎదగాలి



అంబేడ్కర్ జయంతిని ప్రారంభిస్తున్న నాయకులు

పావగడ: రాజ్యాంగం నిలవాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలని హైకోర్టు న్యాయవాది, ప్రొఫెసర్ డా హరిరాం తెలిపారు. తాలూకాలోని ముగదాళబెట్ట గ్రామంలో మంగళవారం నిర్వహించిన డా బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ రూపుదిద్దిన భారత రాజ్యాంగం ఒక జాతి, సామాజిక వర్గానికి పరిమితం కాదన్నారు. రాజ్యాంగం విలువలు కేవలం విద్యావంతులకు మాత్రమే అర్థమవుతాయన్నారు. పాశేగార్ లోకేశ్ మాట్లాడుతూ మహానుభావుల జయంతి వేడుకలు ఒక రోజుకు పరిమితం కాకూడదని, వారి ఆశయాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరూ పునికి పుచ్చుకోవాలన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు పూర్ణ కుంభ కలశాలను మోశారు. కార్యక్రమంలో ప్రమీలా నరసింహమూర్తి, సణ్ణప్ప, ఈరణ్ణ, భాస్కర నాయక, ఓంకార నాయక తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బేబీ షో



బేబీ షోలో పాల్గొన్న చిన్నారులు

పావగడ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన బేబీ షో అందరినీ ఆకట్టుకుంది. మూడేళ్లలోపు వయసున్న చిన్నారులు బేబీ షో లో పాల్గొన్నారు. ఎత్తు, పొడవు, బరువు ఉండి ఆరోగ్యంగా ఉన్న చిన్నారులను ఎంపిక చేశారు. పట్టణంలోని 22 అంగనవాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులు బేబీ షో లో పాల్గొన్నారు. అంగనవాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే పౌష్టికాహారం ఏ మాత్రం ఫలితాలు ఇస్తున్నాయో గుర్తించేందుకు బేబీ షో కార్యక్రమం నిర్వహించామని సీడీపీఓ సునీత తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులకు భాగ్య లక్ష్మి పత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌కుమార్, అంగనవాడీ సూపర్ వైజర్ సుధ, ఆస్పత్రి వైద్యులు బాబు, చంద్రశేఖర్, సురేశ్, ఎల్‌హెచ్‌వీ ప్రభామణి, అంగనవాడీ కార్యకర్తలు యశోద, భూలక్ష్మి, రత్న, గిరిజ, ప్రశాంత తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటాల పంపిణీ

చిలమత్తూరు: మండలంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటం ఉండాలని బీజేపీ మండల అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మండల బీజేపీ నాయకులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలకు మోదీ చిత్రపటాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువ మోర్చా అధ్యక్షుడు సంతోష్‌కుమార్‌రెడ్డి, నాయకులు వెంకట్, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, కోడూరుశ్రీనివాసులు, ఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

రొద్దం: మండల పరిధిలో కోగిర గ్రామంలో ఎన్నికల కౌంటింగ్ అనంతరం జరిగిన ఘర్షణ చోటుచేసుకున్న నేపథ్యంలో ఈనెల 5 నుంచి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 19 వరకూ గ్రామంలో పికెట్ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంగా పత్తా ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామ శివారులో మంగా పత్తా (బొట్టాట) ఆడుదున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. మంగళవారం వచ్చిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఏడుగురిని ఆదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 22,180 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసుకుని కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ముందస్తుగా వేరుశనగ పంట సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తప్పని సరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మంజునాథ తెలిపారు. ముందస్తుగానే వర్షాలు కురుస్తుండటంతో పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు వేరుశనగ విత్తనాన్ని శుద్ధి చేసుకొని విత్తుకోవాలని కోరారు. విత్తనాన్ని శుద్ధి చేయడం వలన విత్తనం బాగా మొలకెత్తడంతో ఎలాంటి తెగుళ్లు సోకవన్నారు. అదేవిధంగా మంచి దిగుబడి వస్తుందని ఏఓ తెలియజేశారు. వేరుశనగ పంటలో అంతర పంటగా కంది, అలసంద, పెసలు, ఉలవలను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. సజ్జ, కొర్ర తదితర పంటలను ఆయకట్టు కింద రైతులు సాగు చేయాలని సూచించారు.

రోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెనుకొండ: పట్టణంలో శ్రీసత్యసాయి సేవా సమితి నేతృత్వంలో షిర్డిసాయిబాబా ఆలయంలో మంగళవారం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పుట్టపర్తికి చెందిన భగవాన్ సత్యసాయి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పట్టణంలో రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం రోగులకు మందులను అందజేశారు. ప్రతినెలా రెండో మంగళవారం ఇక్కడి వచ్చి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు తెలిపారు.

కందులకు రిజిస్ట్రేషన్లు

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు సంబంధించి కందుల రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు వ్యవసాయ సబ్ డివిజన్ అధికారి అల్తాఫ్‌ఖాన్ తెలిపారు. కావాల్సిన రైతులు తమ సమీప ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి రెండు రోజుల్లో కందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచామని, అవసరమైన రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్లవచ్చన్నారు.

రైతులకు అందుబాటులో కందులు

పెనుకొండ రూరల్: గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో కందులను రైతులకు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి చందన ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు కేజీల ప్యాకెట్ ధర రూ.391గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి అవసరమైన రైతులు కొనుగోలు చేయాలని సూచించారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండలంలోని చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. తర్వాత భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యం కట్టి పూలతో అలంకరించి మహా మంగళ హారతి చేశారు. ఆలయంలో అమ్మవారికి విశేష పూజ రోజు కావడంతో చుట్టు పక్కల గ్రామాల పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధులు, సంతాన భాగ్యం లేని వారు, పెళ్లి కాని యువతులు ఆలయ సమీపంలోని గల పాలబావి వద్దకు చేరుకుని గంగ పూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు ప్రధాన అర్చకులు సూర్యనారాయణచార్ మహా మంగళారతి ఇచ్చారు. కార్యక్రమంలో రాజవంశీకుడు రంగప్పరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.